సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం, 16, సెప్టెంబర్, 2024



అప్పన్నకు తిరువీధి

సింహాచలం: సింహగిరిపై పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి తిరువీధిని విశేషంగా నిర్వహించారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

విశాఖ: శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.



పెద్దేరుకు జలకళ

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయానికి జలకళ నెలకొంది.120 క్యూసెక్కులు ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

మోదమ్మ ఆలయంలో మూడు రోజులు అన్నదానం

- మంగళ, శుక్ర, ఆదివారాల్లో నిర్వహణ



అన్నదానంలో నిమగ్నమైన ఆలయకమిటీ ప్రతినిధులు

పాడేరు : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం స్థానిక మోదకొండమ్మ తల్లి ఆలయంలో దర్శనానికి వచ్చే భక్తులకు వారంలో మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ప్రారంభించారు. వారంలో మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బోనంగి రమణ, సల్లా రామకృష్ణ, ఉడా త్రినాథరావు, కొణతాల సతీష్, గూడేపు ప్రకాష్, గబులంగి శంకర్‌రావు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

పెదబయలు: స్థానిక గురుకుల రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విఠల్‌ను ఏపీ గురుకుల కార్యదర్శి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పాంగి విజన్ అనారోగ్యం కారణంగా గత నెల 12న ఇంటికి వెళ్లాడు. ఆ తరువాత ఆస్పత్రిలో చేరిన విజన్ చికిత్స పొందుతూ అదే నెల 22న మృతి చెందాడు. ఆస్పత్రి ఎదుట తల్లిదండ్రులు,బంధువులు పాడేరు జిల్లా ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. దీనిపై కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో, గురుకులం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు విచారణ నిర్వహించి నివేదిక అందజేశారు. ఈ మేరకు ప్రిన్సిపాల్‌ను ఏపీ గురుకుల కార్యదర్శి సస్పెండ్‌చేశారు. సీనియర్ లెక్చరర్ కె.ఈశ్వరమ్మకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చెరువులవేనంలో సందడి



వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

చింతపల్లి: మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చెరువుల వేనంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. గత రెండు వారాలుగా విస్తారంగా వర్షాలు కురవడంతో పర్యాటకుల తాకిడి తగ్గింది. గత మూడు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ లంబసింగి, తాజంగి జలాశయ ప్రాంతాలకు రాక మొదలైంది.

చాపరాయిలో..

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి ఆదివారం పర్యాటకులు రావడంతో సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద స్నానాలు చేస్తూ సందడి చేశారు. బేంబూ చికెన్, చీకుల అమ్మకాలు భారీగా జరిగాయి. లోతైన ప్రాంతాల్లోకి పర్యాటకులు వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.



జలపాతం వద్ద పర్యాటకులు

చాపరాయి అందాలు అద్భుతం



గిరి మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న సబ్ కలెక్టర్ దంపతులు

డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం ప్రకృతి అందాలు అద్భుతమని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ దంపతులు పేర్కొన్నారు. ఆదివారం వారు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేసి సందడి చేశారు. చాపరాయి అందాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని వారు పేర్కొన్నారు.

ర్యాంకు వచ్చినా సీటు రాలేదు



నేను నీట్ రాశాను. ర్యాంకు వచ్చినా రాష్ట్రంలో మెడికల్ సీట్లు తక్కువగా ఉండటంతో సీటు రాలేదు. అందుకే లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నా. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉంటే సీట్ల సంఖ్య పెరుగుతుంది. తద్వారా ఎక్కువ మంది ఎంబీబీఎస్ చదివే అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో నీట్‌కు చాలా ఎక్కువ పోటీ ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు ఇచ్చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. - ఎస్ కార్తీక్, పెద్దగదిలి



విద్యార్థుల ఉసురు పోసుకోవద్దు



నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సీట్లు రాకుండా చేయడం దారుణం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వైద్య కళాశాలల నిర్మాణం జరగలేదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తప్పించుకునే ధోరణిలో మాట్లాడడం విడ్డూరంగా ఉంది. కళాశాలల్లో రెండో ఏడాది విద్యార్థులకు తరగతులు జరగడం లేదని.. మాజీ సీఎం జగన్‌పై విష ప్రచారాలు చేయడమే మంత్రులు ప్రధాన పనిగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలు మూత పడేలా చేస్తే.. పేద విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. వారి ఉసురు పోసుకోవద్దు. - పాత్రపిల్లి సునీల్‌కుమార్, జ్ఞానాపురం

ఇల్లు, షాపు మునిగిపోతోంది



చింతూరు శబరిఒడ్డు ప్రాంతానికి చెందిన ఈ దంపతుల పేరు కల్లాకుల కిషోర్, దీపికాభవాని. చిన్న కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఏటా వస్తున్న వరదలకు కిరాణా దుకాణం, ఇల్లు రెండు మూడుసార్లు నీట మునుగుతోంది. దీంతో ఆ సమయంలో పునరావాస కేంద్రంలో, లేదంటే వంతెనపై టెంటు వేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. వరదల్లో ఇల్లు, షాపు మునగడంతో ఏటా తమకు అపారనష్టం వస్తోందని వారు వాపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు వరద వచ్చిందని, ఫ్లోరింగ్ దెబ్బతినడంతో పాటు షాపులోని ఫ్రిజ్, వాటర్ కూలర్ పాడయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంచెత్తితే సామాన్లు తీసుకుని వెళ్లి, తెచ్చేందుకు ఏటా రూ.4వేలు ఖర్చవుతోందని వారు తెలిపారు. ఏటా వరదలు ప్రహసనంగా మారి తమ బతుకులను ఛిద్రం చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

సామాన్లు తరలించేందుకు రూ.5 వేల ఖర్చు



ఇల్లు శుభ్రం చేసుకుంటున్న ఈ వ్యక్తి పేరు వీఆర్‌పురం మండలం శ్రీరామగిరికి చెందిన బొజ్జి రెడ్డి రమేష్. అటు గోదావరి, ఇటు శబరినది వరద కారణంగా ఏటా అతని ఇల్లు రెండు మూడుసార్లు ముంపునకు గురవుతోంది. ఆ సమయంలో ఇల్లు ఖాళీచేసి సమీపంలోని కొండపై టెంటు వేసుకుని బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని రమేష్ వాపోయాడు. వరదల సమయంలో ఇల్లు ఖాళీచేసి సామాన్లు తరలించి తిరిగి తీసుకొచ్చేందుకు రూ.5 వేల వరకు ఖర్చవుతోందని అతను ఆవేదన వ్యక్తం చేశాడు.

జిల్లాలో భారీ వర్షాలు, గోదావరి, శబరి నదుల వరదలు విలీన మండలాల ప్రజలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. వందలాది గ్రామాలకు వెళ్లే రహదారులు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. విధ్వంసం సృష్టించిన కొండచరియలు కొండవాలు ప్రాంత గ్రామాలను అతలాకుతలం చేశాయి. అంతర్‌రాష్ట్ర రహదారిని ధ్వంసం చేసి తేరుకోలేని నష్టాన్ని మిగిల్చాయి. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడి చర్యలతో చేతులు దులుపుకుంటోంది. శనివారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సాక్షి బృందం పర్యటించింది.

ఏ గడప కదిపినా కన్నీరే..

- జిల్లాను ముంచెత్తిన వరదలు
- కొండచరియల విధ్వంసానికి కొండవాలు గ్రామాలకు తీవ్ర నష్టం
- ధ్వంసమైన అంతర్‌రాష్ట్ర రహదారి
- తేరుకోలేని నష్టం
- చిన్నాభిన్నమైన బతుకులు



విలీన మండలాల్లో ఏటా ఇలా సామాన్లు తరలించాల్సిందే

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి,పాడేరు/చింతూరు: ఇటీవల సంభవించిన భారీ వర్షాలకు జిల్లా ప్రజలు వణికిపోయారు. గోదావరి, శబరి నదుల వరదలకు చింతూరు డివిజన్‌లోని విలీన మండలాల్లో 113 గ్రామాల్లో 19,766 కుటుంబాలపై ప్రభావం చూపాయి. 48 రోడ్లు వరద ముంపునకు గురి కావడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలతో రవాణా సంబంధాలు తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం ,పాడేరు డివిజన్ల పరిధిలో కూడా వరద నష్టం ఎక్కువగానే ఉంది. అంతర్‌రాష్ట్ర రహదారి గూడెంకొత్త వీధి – సీలేరు మధ్య కొండవాలు ప్రాంతాల్లో కొండచరియల విధ్వంసానికి నామరూపాలు లేకపోయింది. బ్రిడ్జిలు, వంతెనలు కొట్టుకుపోయాయి.

- వందలాది ఎకరాల్లో వరి పైరు ముంపునకు గురైంది. ఇసుక, మట్టి మేటలు వేయడంతో పెట్టుబడులు కోల్పోయి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.
- గూడెంకొత్తవీధి మండలం జీకేవీధి, సప్పర్ల, గాలికొండ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలో కొండవాగుల ఉధృతికి పంట భూములన్నీ ముంపునకు గురయ్యాయి. కొన్నిచోట్ల బండరాళ్లతో నిండిపోయాయి. సాగుకు పనికిరాకుండా పోవడంతో గిరి రైతులు ఉసూరుమంటున్నారు. కాఫీ తోటలు, మిరియం పాదులకు నష్టం వాటిల్లింది.

చట్రాపల్లిలో దారుణం

గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. అర్ధరాత్రి వేళ కొండచరియలు విరుచుకుపడటంతో ఆరు గిరిజన నివాస గృహాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. గిరి మహిళ కుమారి మృతి చెందింది. గాయపడిన మరికొంతమంది కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. నివాసాలు కోల్పోయిన వారంతా సప్పర్లలోని పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్నారు.

- విలీన మండలాల ప్రజలు ఇప్పటివరకు రెండు భారీ వరదలను చవిచూశారు. 1986లో అత్యధికంగా 75.60 అడుగులు, 1990లో 70.80 అడుగులు, 2022లో 71.30 అడుగుల మేర వరద నమోదైంది. ఈ మూడు వరదలు ఇక్కడి ప్రజలకు భారీగా ఆస్తి నష్టాన్ని కలుగజేశాయి. ఈ ఏడాది ఇప్పటికే రెండుసార్లు వరద 50 అడుగులు దాటడంతో నాలుగు మండలాల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.



గూడెంకొత్తవీధి మండలం చట్రాపల్లి ప్రాంతంలో కోతకు గురైన పంట భూమి



వరద ఉధృతికి కొట్టుకుపోయిన చట్రాపల్లి మార్గంలో రోడ్డు, కల్వర్టు

నాలుగు నెలలు వలస జీవులుగా..

వర్షాకాలం నాలుగు నెలలు నాలుగు మండలాల ప్రజలు వలస జీవులుగా మారిపోతున్నారు. వరదల నుంచి ప్రాణాలు, ఆస్తులు కాపాడుకునేందుకు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. నాలుగు నెలల కోసం కొంతమంది సమీపంలోని భద్రాచలం పట్టణంలో రూ.వేలల్లో అద్దెలు చెల్లిస్తున్నారు. మరికొందరు గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాలు, ఎత్తయిన ప్రాంతాల్లో పాకలు, గుడారాలు నిర్మించుకుంటున్నారు. వరద పోటెత్తితే నాలుగు మండలాల్లో రహదారులు ముంపునకు గురవుతున్నందున ముందుగానే తమ ఇళ్లలోని సామగ్రిని తరలిస్తున్నారు.

సరకుల పంపిణీకే పరిమితం

భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడి సహాయక చర్యలతో చేతులు దులుపుకుందన్న విమర్శలున్నాయి. విలీన మండలాల్లో పెద్ద సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లు నీటమునగడంతో సర్వం కోల్పోయారు. వంటపాత్రలు కొట్టుకుని పోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆహారం అందించకుండా నిత్యావసర సరకులు అందజేసి చేతులు దులుపుకున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు ముంపు ప్రభావిత ప్రజలను మరింత బాధించింది.

జిల్లాలో వరద నష్టం

ప్రభావిత గ్రామాలు :140
వరి పంట నష్టం : 2774.46 హెక్టార్లు
పెట్టుబడి నష్టం : రూ.241.45లక్షలు
ఉద్యానవన పంటలు : 81హెక్టార్లు
నష్టం : రూ.14.37లక్షలు
దెబ్బతిన్న ఇళ్లు : 341
నష్టం : రూ.58.36 లక్షలు
పశువులు, గొర్రెలు, కోళ్లు : 223
నష్టం : రూ.11.03 లక్షలు
ఆర్‌అండ్‌బీ రోడ్లు : 90.29 కి.మీ.
నష్టం : రూ.55.7కోట్లు
బ్రిడ్జిలు, వంతెన : 29
నష్టం : రూ.17.4 కోట్లు
నీటి ప్రవాహానికి దెబ్బతిన్న రోడ్లు : 37
నష్టం : రూ.58.15 లక్షలు
పీఆర్ రోడ్లు, వంతెనలు: రూ.779.53 కోట్లు
33 చెక్‌డ్యామ్‌లకు నష్టం : రూ.22.31 లక్షలు
37 తాగునీటి పథకాలు : రూ.84.5లక్షలు
12 మత్స్యకారుల వలలు : రూ.60వేలు
వైద్య ఆరోగ్యశాఖ : రూ.22 లక్షలు
విద్యుత్ పంపిణీ సంస్థ : రూ.30.05లక్షలు

ముంచెత్తిన ఉభయ నదులు

గతంలో భద్రాచలంలో గోదావరి వరద 55 అడుగులు దాటితే కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలకు వరదముప్పు ఉండేది. ఇప్పుడు భద్రాచలంలో 45 అడుగులకు చేరితే విలీన మండలాలను వరద ముంచేస్తోంది. గతంలో భద్రాచలం వరద నీటిమట్టానికి, కూనవరంలో నీటిమట్టానికి పది అడుగుల వ్యత్యాసం ఉండేది. కాగా ప్రస్తుతం కాపర్ డ్యాం ఎగపోటు వల్ల భద్రాచలం కంటే కూనవరంలో పది అడుగులు నీటిమట్టం అధికంగా నమోదవుతోంది. ఏటా వరదల కారణంగా భారీ సంఖ్యలో గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. సుమారు 30 వేల కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి.



చట్రాపల్లిలో కొట్టుకుపోయిన నివాసిత ప్రాంతం



టెంట్లలో గడుపుతున్న వరద బాధితులు



నీటమునిగిన వడ్డిగూడెం గ్రామం



పేరుకుపోయిన బురదను తొలగిస్తూ..



వరదకు నీటమునిగిన చింతూరు సెంటర్

శాశ్వత పరిష్కారం చూపాలి



వరదల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్న తమకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి. ఇళ్లు మునిగి విలువైన సామగ్రి పాడవుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తోంది. దీనిపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.
– తుర్లపాటి సాగర్, శబరి ఒడ్డు, చింతూరు

ముందే సర్దుకోవాల్సి వస్తోంది



గతంలో భద్రాచలంలో 60 అడుగులు వచ్చేవరకు మాకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం 45 అడుగులకే కూనవరంలో గోదావరి ఎగపోటుకు గురవుతుండడంతో ముందే సామాన్లు సర్దుకోవాల్సి వస్తోంది. లేదంటే రహదారులు నీటమునిగి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు దారిలేకుండా పోతోంది.
– సయ్యద్ యూసఫ్, కూనవరం

పరిహారం మిచ్చి పునరావాసం కల్పించాలి



ఏటా జూలై నుంచి సెప్టెంబరు వరకు వరదలు రావడం పరిపాటిగా మారిపోయింది. ఆ సమయంలో పనులు దొరక్క పూటగడవడం కష్టంగా ఉంటోంది. పోలవరం ముంపులో వున్న మాకు పరిహారంతో పాటు పునరావాసం కల్పించి ఇక్కడినుంచి తరలించారు.
– గూటాల గౌతమి, వడ్డిగూడెం

ఆరు ఎకరాల్లో వరి పంట ధ్వంసం



భారీ వర్షానికి మా అన్నదమ్ములకు చెందిన ఆరు ఎకరాల్లో వరి పంట ధ్వంసమైంది. కొండవాగుల నీరంతా భూములను ముంచెత్తింది. దీంతో ఈ ఏడాది తిండి గింజలను కోల్పోయాం. భూమి కూడా సాగుకు పనికి రాకుండా పోయింది.
– కిముడు వీరన్న, త్రినాథ్, ధారగొంది జీకేవీధి మండలం

ప్రాణభయంతో గడిపాం



వరద వచ్చిన రోజు రాత్రంతా నిద్ర పోలేదు. ప్రాణభయంతో ఇంట్లోనే ఉన్నాం. మా గ్రామానికి ఇరువైపులా కొండల నుంచి వరదనీరు, బండరాళ్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు వచ్చాయి. ఉదయం బయటకు వచ్చి చూసేసరికి గ్రామం నామరూపాలు లేకుండా ఉంది.
– కొర్రా శాంతి, పనసలబంద, జీకేవీధి మండలం

జామిగుడ ఘటనలో బాధ్యులపై చర్యలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



వసతి గృహంలో సమస్యలు తెలుసుకుంటున్న హుస్సేన్ నాయక్

- కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

డుంబ్రిగుడ: జామిగుడ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినుల అస్వస్థతపై బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ సూచించారు. ఆదివారం జామిగుడ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. కలుషిత ఆహారం తిని విద్యార్థినులు ఆస్పత్రి పాలైతే జిల్లా అధికార యంత్రాంగం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. సస్పెన్షన్‌తో సరిపెట్టారన్నారు. వసతి గృహంలో విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. వారం రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీడీ కొండలరావు, బీజేపీ జిల్లా నేత పాంగి. రాజారావు, ఎంపీటీసీ దేవదాసు, అరకు సీఐ హిమగిరి, హెచ్‌ఎం అప్పలమ్మ పాల్గొన్నారు.

దైవక్షేత్రం అభివృద్ధికి రూ.25 లక్షలతో ప్రణాళిక



మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పురాతన దైవ క్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం అభివృద్ధికి రూ.25లక్షలతో ప్రణాళికను రూపొందిస్తున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఆలయ ఆధ్యాత్మిక సేవాసంఘం సమావేశంలో సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్న బాహుబలి

పాలనురగలతో పరవళ్లు తొక్కే సరియా జలపాతం బాహుబలి జలపాతంగా ప్రాచుర్యం పొందింది. పేరుకు తగ్గట్టుగానే సందర్శనకు వచ్చిన పర్యాటకులను బలితీసుకుంటోంది. ఇప్పటివరకు 40 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. తాజాగా మరో ఇద్దరిని కబళించి ఆయా కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది.

8లో



సరియా జలపాతంలో గల్లంతైన వారికోసం గాలిస్తున్న ప్రత్యేక బృందాలు

గాజువాక.. మజాకా

టాలీవుడ్‌లో దుమ్మురేపుతున్న గాజువాక యువతరం

ఒక్క చాన్స్‌తో బోలెడు సినిమాలు

హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, కొరియోగ్రాఫర్లుగా రాణింపు

ఒక్క చాన్స్ కోసం ఎంతో కష్టపడిన గాజువాక యువత ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో దూసుకుపోతున్నారు. హీరోలుగా, క్యారెక్టర్ ఆర్టిస్టులుగా, దర్శకులుగా, కొరియోగ్రాఫర్లుగా తమ సత్తా చాటుతున్నారు. ప్రసన్న కుమార్ నంది అవార్డులు అందుకోగా, అఖిల్ కార్తీక్ 17 సినిమాల్లో నటించి హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, డాక్టర్ రవి ప్రకాష్, సునీత వర్మ, ఎఫ్ఎం బాబాయ్ వంటి వారు కూడా తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కొరియోగ్రాఫర్లుగా, దర్శకులుగా కూడా ఇక్కడి యువత రాణిస్తున్నారు. వెంకట్, పండు, రమేష్, ఝూన్సీ వంటి డ్యాన్స్ మాస్టర్లు తమ నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తుండగా, కిరణ్ చేబ్రోలు దర్శకుడిగా మెరిసిపోతున్నాడు. అన్ని రంగాల్లోనూ తనకంటూ ప్రత్యేకతను సంతరించుకుని దూసుకెళ్తున్న గాజువాక.. సినీ రంగంలోనూ సత్తా చాటుకుంటోంది. - గాజువాక

డాక్టర్.. యాక్టర్



గాజువాక నుంచి చిత్రసీమలో మెరిసిన మరో నటుడు డాక్టర్ రవిప్రకాష్. వృత్తి రీత్యా డాక్టర్ అయిన ఈ యాక్టర్ టాలీవుడ్, మాలీవుడ్‌లో 200కు పైగా సినిమాల్లో నటించాడు. రవి ప్రకాష్ పుట్టింది విజయవాడలో అయినా గాజువాకలోనే పెరిగి 2000లో శుభవేళ సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. అనతికాలంలోనే తెలుగు సినీ పరిశ్రమలో మంచి పాపులర్ అయ్యాడు. రవి ప్రకాష్ అగ్ర హీరోలతో కలిసి అనేక సినిమాల్లో నటించారు.

17 సినిమాల్లో హీరోగా..



దోస్త్ సినిమాతో కెరీర్ ప్రారంభించిన అఖిల్ కార్తీక్ ఇప్పటి వరకు 17 సినిమాల్లో హీరోగా, నాలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించారు. అలా, ప్రామిస్, లైఫ్ స్టయిల్, రామ రామ కృష్ణ కృష్ణ, 2 ఫ్రెండ్స్ వంటి అనేక హిట్ సినిమాల్లో నటించారు. హీరోగా మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాడు.

సునీత వర్మ మెరుపులు



వడ్లపూడికి చెందిన సునీత వర్మ దక్షిణ భారతానికి చెందిన నాలుగు భాషల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఇటు సినిమా రంగంలోనూ, అటు మోడల్‌గానూ రాణిస్తున్న ఆమె నీ వెంటే నేనుంటా సినిమాతో తెలుగు తెరకు 2000లో పరిచయమైంది. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం భాషల్లో ఇప్పటివరకు 20 సినిమాల్లో కథనాయికగా నటించింది. వీటికి క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసిన సినిమాలు అదనం. 2003 వరకు తెలుగు సినిమాల అనంతరం ఆమె తన జర్నీని తమిళ పరిశ్రమకు మార్చింది. 2004లో ఓరు మురై సొల్లువిడు సినిమాతో తమిళ తెరకు పరిచయమై ఆ తర్వాత కన్నడం, మలయాళం భాషల్లో సైతం అవకాశాలను అందిపుచ్చుకుంది. తెలుగు ప్రేక్షకులకు సునీతవర్మగా పరిచయమైన ఆమె మిగిలిన భాషల్లో ప్రేక్షకులకు రాధావర్మ, అంజువర్మ, జనప్రియగా సుపరిచితురాలు.

యువతరం కథానాయకుడు 'ప్రిన్స్'



ప్రిన్స్ సెసిల్ హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నాడు. 2012లో నీకు నాకు డాష్ డాష్ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమైన ప్రిన్స్ బస్టాప్, రొమాన్స్, బన్నీ అండ్ చెర్రీ, మనసును మాయ సేయకే, వేర్ ఈజ్ విద్యా బాలన్, డాలర్స్ కాలనీ, నేను శైలజ, డీజే డిల్లు తదితర సినిమాల్లో నటించాడు. అటు హీరోగా.. ఇటు క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి ప్రతిభ ప్రదర్శిస్తున్నారు.

సినిమాల్లో కూడా బాబాయే..



జర్నలిస్టుగా సుదీర్ఘ కాలం గాజువాకలో పని చేసిన దాడి త్రినాథ స్వామి ప్రస్తుతం పలు సినిమాల్లో బిజీగా ఉన్నారు. జర్నలిజం నుంచి రేడియో జాకీగా మారిన త్రినాథ్ స్వామి ఎఫ్.ఎం.బాబాయ్‌గా అందరికీ సుపరిచితుడు. సినిమాల్లో ఆయన పోషించే పాత్రల పేరు కూడా ఎక్కువగా బాబాయ్‌గానే ఉంటాయి. ఒకపక్క సినిమాల్లోనే నటిస్తూనే మరోపక్క ఔత్సాహికులకు ఆయన శిక్షణ కూడా ఇస్తున్నారు.

ప్రసన్న నటనకు తొమ్మిది నందులు



1981లో ముద్దమందారం సినిమాతో వెండితెరకు పరిచయమైన ఐ.ప్రసన్నకుమార్ తెలుగు సినీరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. చంటి సినిమాలో కథానాయికకు చిన్న అన్నయ్యగా అందరికీ సుపరిచితుడయ్యారు. అప్పటి నుంచి సుమారు 200 సినిమాల్లో నటించారు. ప్రతిఘటన, సూపర్ హీరోస్, ఆరంభం, ఒంటరి పోరాటం, అక్కా బాగున్నావా వంటి సినిమాల్లో మంచి పాత్రలను పోషించారు. చిన్నప్పటి నుంచి రంగస్థల నటుడుగా అనుభవం ఉన్న ఆయన పలు టెలీ సీరియళ్లను కూడా నిర్మించి నంది అవార్డులను పొందారు. తెలుగుతోపాటు కన్నడం, ఆంగ్ల సినిమాల్లో కూడా నటించారు. అత్యుత్తమ నటనతో తొమ్మిది నంది అవార్డులను సొంతం చేసుకున్నారు.

లక్స్ రాజశేఖర్.. పండు మనోళ్లే





ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ లక్స్ రాజశేఖర్ ఈ ప్రాంతానికి చెందినవాడే. అనేక సినిమాలకు ఆయన డ్యాన్స్ మాస్టర్‌గా పని చేయడంతోపాటు ఎందరో డ్యాన్స్ మాస్టర్లను తయారు చేశాడు. ఇదే కోవకు చెందినవాడు డ్యాన్స్ మాస్టర్ పండు. ఈటీవీలో ప్రసారమవుతున్న ఢీ, శ్రీదేవి డ్రామా కంపెనీతోపాటు వివిధ షోలకు కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. వివిధ సినిమాలకు కూడా ఆయన కొరియోగ్రాఫర్‌గా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. డ్యాన్స్ మాస్టర్ రమేష్, ఝూన్సీ తదితరులు ఈ ప్రాంతం నుంచి వెళ్లి అవకాశాలు సంపాదిస్తున్నారు. వారి జోడీ ఎంత ప్రాచుర్యం పొందిందో తెలిసిందే.

వెండితెర 'స్వీటీ'

రంగస్థలం కార్యక్రమాల్లో పేరొందిన స్వీటీ ప్రస్తుతం సినిమా నటిగా స్థిర పడింది. గొంతినవానిపాలేనికి చెందిన ఈమె సిద్ధూ ఫ్రం శ్రీకాకుళంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఇప్పటివరకు పలు సినిమాల్లో నటించిన ఆమె విక్రమార్కుడు సూపర్‌హిట్ మూవీలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశం పొందింది.

జీమా ఏర్పాటు

వందలమంది సినిమా, టీవీ షో కళాకారులతో గాజువాక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (జీమా) ఏర్పాటైంది. ఇందులో సినిమాలు,షార్ట్ ఫిల్మ్‌ల్లో నటించే వారు, నిర్మాతలు, డైరెక్టర్లు, సీరియల్స్‌లో నటిస్తున్న సుమారు 459 మంది సభ్యులుగా ఉన్నారు.

డ్యాన్సర్‌గా..యాక్టర్‌గా..



డ్యాన్సర్‌గా, కొరియోగ్రాఫర్‌గా సుపరిచితుడైన విశాఖ థ్రిల్లర్స్ వెంకట్ దర్శకుడిగా కూడా పరిచయమయ్యాడు. వివిధ టీవీ షోలు, రంగస్థలంపై డ్యాన్స్‌తో అలరించిన ఆయన 'వీలైతే ప్రేమిద్దాం'సినిమాతో దర్శకుడిగా మారాడు. జెమినీ టీవీ నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌లో విజేతగా నిలవడంతో అదే టీవీలో కొన్నాళ్లపాటు కొరియోగ్రాఫర్‌గా అవకాశం పొందాడు. 26 ఎపిసోడ్‌లకు పని చేశాడు. ప్రముఖ హీరోలు అల్లు అర్జున్, మనోజ్, రాజా, రవితేజ, హీరోయిన్లు శ్రియ, సదా, చార్మీలకు కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. ప్రభాస్‌తో ఒక పాటకు పూర్తిస్థాయి కొరియోగ్రాఫర్ చేశాడు. శ్రీహరి హీరోగా వచ్చిన భద్రాద్రి సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, మిస్డ్‌కాల్ సినిమాలో నలుగురు హీరోల్లో ఒక హీరోగా నటించారు.

ఒక్క ఛాన్స్ కోసం

వీధి డ్యాన్స్‌ల నుంచి నేరుగా సినిమా హీరోగా మారిన యువకుడు లక్స్ రాజు. వీలైతే ప్రేమిద్దాం సినిమాలో హీరోగా పరిచయమయ్యాడు. ఈ ప్రాంతానికి చెందిన శివ హీరోగా, సెకండ్ హీరోగా రాణిస్తున్నాడు. మిస్డ్ కాల్, వీలైతే ప్రేమిద్దాం, బుల్లబ్బాయి వంటి సినిమాల్లో మంచి ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రొగ్రాంలతో మంచి గుర్తింపు పొందిన తులసీ రామ్ పలు సినిమాల్లో నటించాడు. వీలైతే ప్రేమిద్దాం, 4జీ వంటి సినిమాల్లో అతడి నటనకు ప్రేక్షకులు నీరాజనం పట్టారు. గాజువాక జోగవానిపాలేనికి చెందిన పల్లా ఆనంద్‌రాజ్ హీరోగా తనను తాను నిరూపించుకున్నాడు. మనుషులతో జాగ్రత్త సినిమాలో కథా నాయకుడిగా చేసిన ఆయన అంతకుముందు ఛత్రపతి, దేశముదురు సినిమాల్లో కూడా నటించాడు. తన స్టెప్పులతో కుర్రకారు గుండెలను పిండేసే డ్యాన్సర్ పండు(పల్లవి) కుందనపు బొమ్మ, చంద్రుడిలో ఉండే కుందేలు వంటి సినిమాల్లో తన సత్తా చాటుకుంది. పలు సినిమాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన కిరణ్ చేబ్రోలు అయ్యో రామ సినిమాతో డైరెక్టర్‌గా మారాడు. మెహర్‌నగర్‌కు చెందిన లయన్ జగదీష్ దశాబ్ద కాలంగా అసోసియేట్ డైరెక్టర్‌గా పలు సినిమాలకు పని చేశారు.

అనుమానం పెనుభూతమై..

ఎంవీపీ కాలనీ(విశాఖ): అనుమానం పెనుభూతమైంది. భార్య ప్రవర్తన సరిగా లేదని భావించిన భర్త ఆమెపై కక్ష పెంచుకొని చున్నీతో ఉరివేసుకొని హత్య చేశాడు. ఈ ఘటన ఆదివారం ఎంవీపీ కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన డానియేల్, సీలేరుకు చెందిన సలోమి (28) 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. విశాఖలోని నక్కవానిపాలెం శివాలయం వీధిలో ఉంటున్నారు. డానియేల్ ఎండాడలోని ఓ చర్చిలో పనిచేస్తుండగా సలోమి నగరంలోని ఓ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. వీరికి కుమారులు(కవలలు) ఉన్నారు. భార్యపై డానియేల్‌కు అనుమానం ఉండటంతో వీరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మరోసారి గొడవ జరగ్గా డానియేల్ చున్నీతో భార్యను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. సలోని తల్లి వీరి ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె విగతజీవిగా కనిపించింది. వెంటనే ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ గాజువాక తుంగ్లాంలో 25 లక్షలకు ఇల్లు అమ్మకమునకు కలదు మరియు 22 లక్షలకు 75 గజాలు స్థలం అమ్మకమునకు కలదు. డైరెక్ట్ పార్టీస్. ఫోన్ : 73864 14017 [V- 786935]

■ Wanted Male Marketing Team Leaders Executives, Cashiers, Batch incharges as non Teaching Staff in a reputed Educational Organisation Qualification Any Inter / Degree / P.G, Age Limit: 21 to 45years, Salary: Negotiable. Working Location: Gajuwaka. Vizag. Contact: 8008557071, 8008556073 [G-5680]

■ Wanted ACCOUNTANT with 5 Years Experience for Granite Company at Ravikamatam (Vi & M), Anakapalli District, Vishakhapatnam. Call: 9490216064, 040-23353353 vbmpvtltd@yahoo.com [H-783073]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

www.sakshi.com

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 7702473949 [G-9034]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయ సంఘం నాయకులు

అరకులోయటౌన్: గిరిజన ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. స్థానిక పున్నమి వేలి రిసార్ట్స్‌లోని గోష్టి సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఉమ్మడి తెలుగు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉపాధ్యాయుల సంఘం సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. గతంలో సంఘం అధ్యక్షుడిగా చేసిన సేవలను తోటి సంఘ నాయకులు గుర్తు చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగంను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. ఉమ్మడి రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, కార్యదర్శి శేషగిరిరావు, జిల్లా నాయకులు నీలకంఠం, జి.అప్పారావు, కెందు, తెలుగు రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు బాబూరావు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఎస్ఐ వెంకయ్య అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులో తమ మోపెడ్‌పై బాబూరావు(65), సత్యనారాయణ(65) అనే ఇద్దరు వ్యక్తులు వెళ్తూ రోడ్డు పక్కన ఆగారు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన ఓ ట్రాక్టర్ వీరిని బలంగా ఢీకొట్టడంతో ఇరువురు కింద పడిపోయారు. తీవ్రగాయాలైన వీరిని స్థానికులు వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలేశ్వరం సీహెచ్‌సీకు పంపించారు. మార్గ మధ్యలో బాబూరావు అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామ శివారులో బాబూరావు తన పొలానికి నడిచి వెళ్తుండగా సత్యనారాయణ తన వాహనంతో రావడంతో మోపెడ్‌పై ఎక్కి కొంత ముందుకు వెళ్లి వాహనాన్ని ఆపడంతో ఈ ప్రమాదం జరిగినట్టు గుర్తుచేసుకొని మృతుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకయ్య తెలిపారు. కాగా వీరిని ఢీకొట్టి వేగంగా వెళ్లిపోయిన ట్రాక్టర్ , డ్రైవర్‌పై ఆరా తీస్తున్నట్టు చెప్పారు. అయితే ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న సత్యనారాయణను మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు తెలిసింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో డీఏవీ విద్యార్థి ప్రతిభ



విజేతలతో స్టీల్‌ప్లాంట్ జీఎం మధుసూదనరావు తదితరులు

సీలేరు: ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో 100 మీటర్లు , 200 మీటర్ల పరుగు పందెంలో సీలేరు డీఏవీ పాఠశాలలో 10వ తరగతికి చెందిన ఎస్‌కె.అమీర్‌బాషా ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జీఎం.మధుసూధనరావు, ప్రిన్సిపాల్ శ్రీకర్ తదితరులు విజేతకు రజత పతకాన్ని అందజేశారు. ఈ మేరకు జార్ఖండ్‌లో జరగనున్న జాతీయ క్రీడా పోటీల్లో అమీర్‌బాషా పాల్గొంటాడని ట్రైనర్, పీఈటీ కమలాకర్ తెలిపారు. సీలేరు విద్యార్థి జాతీయ క్రీడలకు ఎంపిక కావడంతో సీలేరు డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కోరలు చాస్తున్న బాహుబలి

- జలపాతంలో గల్లంతైన ఇద్దరి మృతదేహాల లభ్యం
- శ్రమించి బయటకు తీసిన ఎన్‌డీఆర్ఎఫ్ నేవీ బృందాలు
- పోస్టుమార్టంకు తరలింపు



వాగు నుంచి తరలిస్తున్న దిలీప్‌కుమార్ మృతదేహం



బయటకు తీసిన సాయికుమార్ మృతదేహం

అనంతగిరి (అరకులోయ రూరల్): సెలవు వేళ సరదాగా గడిపేందుకు కుటుంబసభ్యులు, స్నేహితులతో జలపాతం వద్దకు వచ్చిన ఇద్దరు ఊహించని పరిస్థితుల్లో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. దీంతో విహారం కాస్త విషాదంగా మారింది. మండలంలోని జీనబాబు పంచాయతీలోని సరియా (బాహుబలి) జలపాతంలో శనివారం సందర్శనకు వచ్చిన లంక సాయికుమార్ (33), దిలీప్‌కుమార్ (31) గల్లంతవడం తెలిసిందే. వీరిద్దరు మృతదేహాలను జలపాతంలోంచి ఆదివారం ఎన్‌డీఆర్ఎఫ్, నేవీ బృందాలు, స్థానికులు బయటకు తీశారు.

దైవక్షేత్రాల సందర్శనకు ఒకరు.. సహోద్యోగితో కలిసి మరొకరు..

విజయనగరం జిల్లా బాబామెట్టకు చెందిన లంక సాయికుమార్ హైదరాబాద్‌లోని భీమవరంలోని సర్కా మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. బీహార్‌లోని బడితిపూర్‌మలాహి గ్రామానికి చెందిన దిలీప్‌కుమార్ విశాఖలోని నేవీలో సీనియర్ సెయిలర్‌గా పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో సాయికుమార్ ముగ్గురు స్నేహితులతో కలిసి విశాఖలోని దైవక్షేత్రాలను సందర్శించారు. అక్కడి నుంచి శనివారం నేరుగా సరియా జలపాతం అందాలను తిలకించేందుకు వచ్చారు. ఇక్కడ అందాలు తిలకిస్తుండగా సాయికుమార్ ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయారు. జలపాతం సందర్శనకు వచ్చిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ తన సహోద్యోగితో కలిసి అతనిని కాపాడేందుకు ప్రయత్నించారు. దీనిలో భాగంగా జలపాతంలోకి వారిద్దరు దూకగా దిలీప్‌కుమార్ గల్లంతయ్యారు. సహోద్యోగి ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు.

అష్టకష్టాలు పడి

జలపాతం ఉధృతంగా ప్రవహించడం వల్ల గల్లంతైన వారిని వెలికితీసేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, నేవీ బృందాలతో పాటు స్థానికులు తీవ్రంగా శ్రమించారు. ఇద్దరి మృతదేహాలను ఊబిలోంచి మధ్యాహ్నం బయటకు తీశారు. అక్కడి నుంచి అటవీప్రాంతం గుండా సుమారు అరకిలోమీటరు పొడవునా మోసుకుని వచ్చి తాళ్లసాయంతో గెడ్డను దాటించారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు అనంతగిరి ఎస్ఐ కరక రాము, దేవరాపల్లి ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాలింపు చర్యలను వీరితోపాటు డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం పర్యవేక్షించారు. ఇలావుండగా ఇప్పటివరకు జలపాతంలో ప్రమాదాలకు గురై 42 మంది ప్రాణాలు కోల్పోయారు.

సినీ నటుడు కె.ఎస్.ప్రసాద్ మృతి



ఆరిలోవ: నగరానికి చెందిన సినీ నటుడు కె.ఎస్.ప్రసాద్(66) అనారోగ్యంతో మృతి చెందారు. హనుమంతవాక దరి క్రాంతినగర్‌లో నివాసముంటున్న ప్రసాద్‌కు నటన అంటే ఇష్టం. ఏయూలో ఉద్యోగం చేస్తూ పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించారు. తొలుత రంగస్థలంపై నాటకాలు ప్రదర్శించారు. నాటక ప్రదర్శనల ద్వారానే ఆయనకు సినిమాల్లో అవకాశాలొచ్చాయి. వివాహ భోజనంబు, జంబలకడిపంబ, కలియుగ పాండవులు, ప్రతిఘటన, సుస్వాగతం తదితర సుమారు 40 సినిమాలలో నటించారు. ప్రసాద్ మూడు నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. అప్పటినుంచి దొండపర్తిలో ఓ అద్దె ఇల్లు తీసుకొని సమీపంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో శనివారం రాత్రి ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె బుల్లయ్య కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండగా, ఓ కుమారుడు సాఫ్ట్‌వేర్, మరో కుమారుడు సివిల్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆయన మరణ వార్త తెలియడంతో పలువురు సంతాపం తెలిపారు.

యోగా పోటీల ఓవరాల్ చాంపియన్ విశాఖ

భీమునిపట్నం: స్థానిక సన్‌స్కూల్‌లో ఆదివారం సాయంత్రం ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలవడంతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. రాష్ట్ర యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఇందులో విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలవడంతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లా ద్వితీయ, కర్నూల్ జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్టుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యోగా అసోసియేషన్ అధ్యక్షులు వర్మ, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి పాల్గొన్నారు.

సనాతన ధర్మం వల్లే దైవ క్షేత్రాలు

ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ



షణ్ముఖశర్మ ప్రవచనం

అనకాపల్లి: సరస్వతి కృప లేకపోతే బుద్ధిహీనులు అయిపోతారని, ఋషులు తపస్సు చేయడం వల్ల తపఃశక్తి వచ్చిందని ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయ శతజయంతి వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పరమేశ్వరి త్రిశక్తి ప్రవచనాలపై ఆయన అనుగ్రహ భాషణం చేశారు. దేవతలు రావడం వల్ల దైవశక్తి వస్తుందన్నారు. రెండు శక్తులు కలిస్తే క్షేత్రం వ్యాసమహర్షి సరస్వతీ దేవి అనుగ్రహంతో వేదాంత గ్రంథాలు రక్షించగలిగాయన్నారు. ఆలయాలు ఉన్నా లేకపోయినా క్షేత్రంలో భగవంతుని శక్తి మాత్రం ఉంటుందన్నారు. సనాతన ధర్మం వల్లే దైవక్షేత్రాలు ఏర్పడ్డాయన్నారు. ఆదిశంకరాచార్య 126 సంవత్సరాలు జీవించి పిల్లలందరికీ భారతదేశం సనాతన ధర్మాలు తెలియపరచారన్నారు. విద్యార్థులందరికీ వేదాలు, పురాణాలు తల్లిదండ్రులు నేర్పించాలని కోరారు. సోమవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకూ ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.